క్లుప్తంగా

కురిసిన వర్షం

దహెగాం: గత ఇరవై రోజుల నుంచి వర్షాలు జాడ లేక పోవడం, పత్తి పూత కాత దశకు రావడంతో రైతులు ఆందోళన చెందారు. అయితే గురువారం కురిసిన వర్షంతో రైతులకు ఊరట కలిగింది. మండలంలోని గెర్రె, గిరవెల్లి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

'అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించొద్దు'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లావ్యాప్తంగా పోలీసు చట్టం 30, కొన్నిప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నందున అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించొద్దని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వర్గాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసేవారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



నిరసన తెలుపుతున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు

దహెగాం: నల్లగొండ జిల్లాలోని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడంతో వారికి మద్దతుగా టీపీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఎంపీడీవో రాజేందర్, పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటూ.. జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు రాజేశ్, శివప్రసాద్, శ్రావణ్ కుమార్, విజయ్‌కుమార్, సుమలత, శ్రీకాంత్, సాయికుమార్, వంశీ, జ్యోతి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రశస్త్' యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈవో శివచరణ్ కుమార్

వాంకిడి: మండల కేంద్రంలోని విద్యావనరుల కార్యాలయంలో గురువారం పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రశస్త్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లోని అనారోగ్య, వైకల్య సమస్యలను ఈ యాప్ ద్వారా గుర్తించాలని, తద్వార చిన్నతనంలోనే చికిత్సలు చేయించి ఆరోగ్యకరమైన భవిష్యత్ అందించగలుగుతామన్నారు. మొత్తం 63 అంశాలు విద్యార్థిలోని ఆరోగ్య పరమైన విషయాలను తెలియజేస్తాయన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ప్రభోద్, నటరాజ్, ఐఈఆర్పీలు తిరుమల, మౌనిక, రిసోర్స్ పర్సన్ సుశీల్, సందీప్, సునీల్, విజయ్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయదశమి ఉత్సవాలకు ఏర్పాట్లు



ప్రచార సామగ్రితో ఉత్సవ కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 12న నిర్వహించే విజయదశమి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా గురువారం ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన ప్రచార సామగ్రిని విడుదల చేశారు. విజయదశమి రోజున ఆలయ ప్రాంగణంలో ఎప్పటిలాగే వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, గుండ వెంకన్న, పిన్నవివేక్, కృపాల్, నర్సింహస్వామి, శ్రీనివాస్, శిరీష్ శర్మ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలను కాపాడాలి

కాగజ్‌నగర్ రూరల్: పర్యాటక ప్రదేశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదేనని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు త్రిశూల్‌పహాడ్‌పై గల ఆలయ సముదాయాన్ని సందర్శించారు. ఆధునిక సమాజంలో పర్యాటక రంగం ప్రాముఖ్యత ఎంతో పెరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహం, యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ జనార్దన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

- వివిధ సంఘాల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు



బెజ్జూర్: ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బెజ్జూర్: చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని రజక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పొన్న చిరంజీవి, వెంకటేశ్, జనగామ శ్రీనివాస్, పొన్న రాకేష్, రవి, కడిమంత రాకేశ్, పొన్న కార్తీక్, కొండ్ర బ్రహ్మయ్య, సామల తిరుపతి, జావిద్, శ్రీరామ శేఖర్ పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వీరోచితంగా పోరాటం చేసి, అగ్రవర్ణాలపై ఆధిపత్యం చేసి మహిళలను చైతన్య పరిచిన వీర వనిత అని కొనియాడారు.

తిర్యాణి: భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం చిట్యాల (చాకలి) ఐలమ్మ చేసిన పోరాటం మరువలేనిదని ఎంపీడీవో వేముల మల్లేశ్ అన్నారు. ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంతో పాటు రజక సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు బూసి సంతోశ్ మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకొని హక్కుల సాధనకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్ రెడ్డి, రాగ్గల రాజమౌళి, దుర్గెట్టి సతీశ్, మల్లేశ్, సాగర్, రాజు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 129 జయంతి వేడుకలను కాగజ్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ పాల్గొని నివాళులర్పించారు.

ఆదర్శవంతురాలు ఐలమ్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కౌటాల: మహిళా శక్తిని ప్రపంచానికి చాటిన ఐలమ్మ అందరికీ ఆదర్శవంతురాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కౌటాల రజక సంఘం ఆధ్వర్యంలో కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీల సంక్షేమమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీలు విశ్వనాథ్, నానయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, రజక సంఘం మండలాధ్యక్షులు రాచకొండ అశోక్, నాయకులు తిరుపతి, ఉమ మహేశ్, రవీందర్ గౌడ్, నాహీం, సత్తయ్య పాల్గొన్నారు.



వాంకిడి: జూనియర్ కళాశాలలో..



తిర్యాణి: నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

రైతులకు అండగా ఉంటాం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠల్

కౌటాల: రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం మండలంలోని తలోడి గ్రామంలో గురుడుపేట, యాపలగూడ, కనికి, తలోడి గ్రామ రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వంద ఏళ్లుగా తమ భూముల్లో పంటలు సాగు చేస్తున్నామని, మా వ్యవసాయ భూములకు పట్టాలు లేక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. గతంలో బండపాటి శివారు పేరిట భూములకు పట్టాలు ఉండేవన్నారు. ప్రభుత్వం స్పందించి తమ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీలు డబ్బుల నానయ్య, విశ్వనాథ్, నాహీం, తిరుపతి, ఉమ మహేశ్, బాపు, రవీందర్ గౌడ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్ ఎంఈవోగా సునీత

బెజ్జూర్: బెజ్జూర్ ఎంఈవోగా సునీత గురువారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న ఎంఈవో రమేశ్ బాబు చేతుల మీదుగా బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆమెను శాలువాతో సత్కరించారు.

వాంకిడి ఎంఈవోగా శివచరణ్ కుమార్

వాంకిడి: మండల విద్యాధికారిగా ఇందాని పీహెచ్‌ఎం శివచరణ్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంఈవోగా పని చేసిన మనుకుమార్ ఇంద్రవెల్లి మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోను మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్కరించారు.

రెబ్బెన ఎంఈవోగా వెంకటేశ్వర్లు

రెబ్బెన: రెబ్బెన ఎంఈవోగా వెంకటేశ్వర్లు గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నవేగాం ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న వెంకటేశ్వర్లును రెబ్బెన ఎంఈవోగా బాధ్యతలు అప్పగించగా ఇదువరకు ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వరస్వామి మంచిర్యాల జిల్లా కాసిపేట మండల ఎంఈవోగా బదిలీ అయ్యారు. ఉపాధ్యాయులు, పీఆర్టీయూ సంఘం నాయకులు సన్మానించారు.

దీపావళి బోనస్ లక్ష రూపాయలు సాధించాలి



మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): కోల్ ఇండియా యాజమాన్యంతో ఈనెల 29న జరిగే స్టాండర్డ్ కమిటీ సమావేశంలో జాతీయ కార్మిక సంఘాలు లక్ష రూపాయల బోనస్‌ను సాధించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం గోలేటిలోని తమ యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. స్టాండర్డ్ కమిటీ సమావేశంలో జాతీయ కార్మిక సంఘాలు గట్టిగా పట్టుబడి బొగ్గు గని ఉద్యోగులకు శుభవార్త చెప్పాలన్నారు. ప్రతీ ఒక్క కార్మికుడికి రూ. 1 లక్ష ఇప్పించే విధంగా కృషి చేయాలన్నారు. గత 5 సంవత్సరాలుగా కేవలం 5 వేలు, 6 వేలు మాత్రమే పెంచుతూ వస్తున్నారని గత సంవత్సరం రూ. 85 వేలు మాత్రమే చెల్లించారని అన్నారు. ఈసారైనా పెరిగిన ధరలకు అనుగుణంగా రూ. 1 లక్షకు తగ్గకుండా బోనస్ సాధించి సింగరేణి ఉద్యోగులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, సెంట్రల్ కమిటీ నాయకులు మాంతు సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ జీవితం ఆదర్శనీయం



సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జీవితం ప్రజలకు ఆదర్శనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లి గ్రామంలో మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి డీఎంహెచ్‌వో తుకారాం భట్‌తో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశ ప్రజలనే తన కుటుంబ సభ్యులుగా భావిస్తారన్నారు. దేశాన్ని ప్రపంచంలో ఉన్నతంగా నిలపాలనే ఉద్దేశంతో శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు డీఎంహెచ్‌వోను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మంగ, పెంటయ్య, శ్రీకాంత్, గట్టయ్య, ప్రసాద్‌గౌడ్, లింగయ్య, పుల్లయ్య, తిరుపతి, సత్తన్న, కిష్టయ్య, ఆత్రం కొండు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు కోలిండియా స్థాయిలో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాధాకృష్ణ

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా క్రీడాకారులు కోలిండియా స్థాయిలో రాణించాలని ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరిండెంట్ ఏఎన్ఎస్ రాధాకృష్ణ అన్నారు. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ వార్షిక క్రీడల్లో భాగంగా గురువారం బెల్లంపల్లి పట్టణంలోని టీసీఓఏ క్లబ్‌లో లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏరియాలో పనిచేసే క్రీడాకారులు క్రీడల్లో అద్భుత ఆటతీరును ప్రదర్శించి కోలిండియా స్థాయిలో రాణించాలని సూచించారు. గతంలో కోలిండియా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. డిపార్టుమెంటల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు నియర్ బై పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, చంద్రకుమార్, శ్రీధర్, కిషోర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లాలోని ప్రతీ మండలానికి రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చటారె భీమ్‌రావు డిమాండ్ చేశారు. గురువారం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఈనెల 27న నిర్వహించే చలో హైదరాబాద్ విద్యార్థి మహాగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు లేక పోవడంతో నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వసాకే సాయికుమార్, చాపిలె సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కరుణ

బెజ్జూర్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణ అన్నారు. తల్లులు పోషక పదార్థాలను ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై ఎంఎల్‌పీహెచ్ గణేష్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఊట్‌సారంగపల్లి గ్రామంలో రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, స్టాఫ్‌నర్స్‌లకు అవగాహన కల్పించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రొటీన్లు, విటమిన్లతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- ఐదుగురితో పాటు వాహనాల పట్టివేత



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

సిర్పూర్(టి): మండలంలోని చీలపెల్లి గ్రామ శివారులో బుధవారం పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులతో పాటు 8 బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు, రూ. 46 వేల నగదు స్వాధీనం చేసుకొని సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మొత్తం 20 మందిపై కేసు నమోదు చేశామని, విచారణ చేస్తున్నామని ఎస్సై కమలాకర్ తెలిపారు.

న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతి



సబ్‌కలెక్టర్‌ను కోరుతున్న గ్రామస్తులు

కాగజ్‌నగర్ రూరల్: తమకు న్యాయం చేయాలని సిర్పూర్ (టి) మండలంలోని ఇటికల్‌పహాడ్ గ్రామానికి చెందిన రైతులు గురువారం కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాను కలిసి వేడుకున్నారు. గతంలో 2500 ఎకరాలను సాగు చేసుకున్నామని, గత ఆరేళ్ల క్రితం నుంచి అటవీశాఖ అధికారులు భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. తమ భూములను అటవీశాఖ అధికారులు పూర్తిగా స్వాధీనపర్చుకుంటారని, తమకు ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలతో పాటు వ్యవసాయ భూములు కేటాయించాలని కోరారు.

ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: గత 24 రోజులుగా కెరమెరి మండలంలో నిలిచిపోయిన ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించాలని మండలంలోని సీఎస్‌సీ వీఎల్ఈ, ఆన్‌లైన్ సెంటర్‌ల నిర్వాహకులు, విద్యార్థులు కోరుతున్నారు. ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలని గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్నెట్ సౌకర్యం లేనందున షాప్‌ల నిర్వాహణ భారమవుతుందన్నారు. కనీసం అద్దె కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు కూడా ఆన్‌లైన్ సేవలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బాలాజీ, ఆడె శంకర్, రాథోడ్ సుదర్శన్, పాండురంగ్, తదితరులు పాల్గొన్నారు.

1న మినీ జాబ్‌మేళా

ఆసిఫాబాద్‌అర్బన్: టాస్క్ ఆధ్వర్యంలో అక్టోబర్ 1న జిల్లా కేంద్రంలోని టాస్క్ కార్యాలయం(పాత కలెక్టరేట్ భవనం)లో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రీజినల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాను డిగ్రీ పూర్తి చేసిన 30 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు టాస్క్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను బ్లాక్‌లిస్టులో పెట్టాలి

ఆసిఫాబాద్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ కట్ చేసి, ఆ డబ్బులు సొంత అవసరాలకు వాడుకుంటున్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి సదరు ఏజెన్సీలను రిన్యూవల్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

టైం స్కేల్ వర్తింపజేయాలి

దహెగాం: కేజీబీవీ, ఆశ్రమ, గురుకులాల్లో సీఆర్‌టీ పార్ట్‌టైం ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేయాలని టీఎస్‌యూటీఫ్ జిలా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీతో పలు పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు చేయించారు. ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలకు నాలుగు నెలల నుంచి వేతనాలు అందలేదన్నారు. వెంటనే ప్రభుత్వం వారి వేతనాలను విడుదల చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలన్నారు.

సమయపాలన పాటించాలి

కౌటాల: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కౌటాల ఎంఈవో గావుడె హన్మంతు అన్నారు. గురువారం ముత్తంపేటలోని బారెవాడ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలన్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం, మాట్లాడడం వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. ఆయన వెంట సీఆర్పీ ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ కార్మికులకు కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలి

రెబ్బెన: సింగరేణి నర్సరీల్లో పని చేస్తున్న కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓడెలు డిమాండ్ చేశారు. గురువారం గోలేటిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల సింగరేణి ప్రకటించిన లాభాల వాటాలో నుంచి యాజమాన్యం సంస్థలో పని చేసే కాంట్రాక్టు కార్మికులకు రూ 5 వేలు ప్రకటించిందని అన్నారు. అయితే గత 10 సంవత్సరాలుగా గోలేటిలోని సింగరేణి నర్సరీలో పని చేస్తున్న మహిళా కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించకపోవటంతో యాజమాన్యం ప్రకటించిన బోనస్‌కు దూరమయ్యారని వాపోయారు. వెంటనే కనీస వేతనాలతో పాటు లాభాల వాటా చెల్లించాలని కోరారు.

గ్రామాల్లో స్వచ్ఛత పాటించాలి



శ్రమదానం చేస్తున్న డీఆర్‌డీవో దత్తారావు

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామాల్లో స్వచ్ఛత పాటించాలని డీఆర్‌డీవో దత్తరావు అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి శ్రమదానం చేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. గతంలో నాటిన మొక్కల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రిన్సిపాల్ అతియా ఖానం, ఇన్‌చార్జి ఎంపీవో వాసుదేవ్, అధ్యాపకులు ప్రకాశ్, గంగాధర్, సమత, ఎస్‌బీఎం సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్పీఎం కాలుష్యంతో ఇబ్బందులు'

కాగజ్‌నగర్ రూరల్: ఎస్పీఎం మిల్లు నుంచి వచ్చే కాలుష్యం కారణంగా పట్టణవాసులు ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్పీఎం నుంచి వెలువడే కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపించారు. స్థానికులకు ఉపాధి కల్పిస్తారని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్పీఎం యాజమాన్యానికి రాయితీలు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తుందని ఆరోపించారు. వెంటనే యాజమాన్యం స్పందించి కాలుష్య నివారణచర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో నాయకులు నక్క మనోహర్, మోయినుద్దీన్, సలీం, శోభన్, అంజన్న, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.